# జాతీయ గేయమాల

స్వాతంత్ర్య పోరాటంలో
ప్రజల గళాల నుండి
వెలువడిన
గేయాల సంకలనం

సమర్పణ:

నాదవినోదిని
1-2-288/14, దోమల్‌గూడ, హైదరాబాద్.
✆ : 27633329, 27676526

## ఈ జాతీయ గేయ సంకలనానికి స్ఫూర్తి ప్రదాత



ప్రముఖగాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు

మాజీ మంత్రివర్యులు

**శ్రీ సిహెచ్.వి.పి. మూర్తి రాజు గారు**

## ముందుమాట

స్వాతంత్ర్యోద్యమ కాలంలో జవసత్వములుడిగి నీరసించిన జాతిని మేల్కొలిపి, వారిలో స్వాతంత్ర్యేచ్ఛ రేకెత్తించి, ఐకమత్య భావము పెంపొందింపజేసి, త్యాగనిరతిని వికసింపజేసి, గాంధీజీ సందేశం దేశం నలుమూలలా చాటి సామాన్య ప్రజానీకంలో సైతం నూతనోత్తేజాన్ని కలిగించిన పాటలివి. ఆ రోజుల్లో శ్రీయుతులు గరిమెళ్ళ సత్యనారాయణ, మంగిపూడి సోదరులు, దామరాజు పుండరీకాక్షుడు, కొండపల్లి జగన్నాథదాసు, బసవరాజు అప్పారావు మొదలగు కవి గాయకుల కలాల్లోంచీ, గళాల్లోంచి దూసుకు వచ్చిన పాటలివి. ఆనాడు ప్రతి తెలుగు నోటా ఈ పాటలు వినిపించేవి.

ఆ పాటలు ఈనాడు మరుగున పడిపోయాయి. జనజీవనంలో నీతి, నిజాయితీ క్షీణించి ఈనాడు ఉన్న పరిస్థితుల్లో జాతిలో ఐక్యతా భావం, సామరస్య గుణం పెంపొందింపజేసిన ఆ పాటలను స్మరించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఈ జాతీయ గేయ సంపదను కాపాడి, యువతరానికి అందించాలనే సత్సంకల్పంతో స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ గాంధేయవాది, మాజీ మంత్రివర్యులు శ్రీ సిహెచ్.వి.పి.మూర్తిరాజు గారి సౌజన్య సహకారాలతో "నాదవినోదిని" సంస్థ రూపొందించిన జాతీయ గేయ మాల ఆడియో ఆల్బమ్/ సీడీలలోని పాటలివి.

కొన్ని గేయాలకు రచయితల పేర్లు లభ్యం కాలేదు.

సహృదయులు మా కృషిని ప్రోత్సహిస్తారని ఆశిస్తూ....

**-పాలగుమ్మి విశ్వనాథం**

## 5. వద్దే వద్దే లక్ష్మీ

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ వద్దే వద్దేలక్ష్మీ ఈ మాయా సరకారీ
మా కెందుకొచ్చిందమ్మా ఈ
తెల్లాదొరతనము మాకెక్క డొచ్చిందమ్మా॥

చ॥ 1. మాటలాడితె తంటా పాట పాడితె తంటా
మాట పాట మానకుంటె నూట నలుబది నోటి కంట
మాయదారీ సరకారీ మాకెందుకమ్మా ॥వద్దే॥

2. ఉప్పువన్నేసీ కళ్ళు కప్పేశాడమ్మా మే
మొప్పుకోపోతే జైలు తప్పదంటాడమ్మా ॥వద్దే॥

3. ఒళ్ళు తెలియకుండ సారా కల్లు పెట్టాడమ్మా
ఇల్లు గుల్ల చేసినాడింకేముందమ్మా
మాయదారీ సరకారీ మాకెందుకమ్మా ॥వద్దే॥

4. గాంధీ టోపీ చూచి వీడికి కంగారెందుకమ్మా మా
గాంధీ టోపీ వెనకాల కానిస్టేబులెందుకమ్మా
మాయదారీ సరకారీ మా కెందుకమ్మా ॥వద్దే॥

5. వడుకు నూలు బట్ట కట్ట వద్దంటాడమ్మా మా
వడుకు నూలు బట్ట జూచి పడికి పోతాడమ్మా ఈ
మాయదారీ సరకారీ మా కెందుకమ్మా ॥వద్దే॥

## 6. కల్లుత్రాగి

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ కల్లు త్రాగి నీ యిల్లు నెల్ల - గుల్ల సేయకు
నీ వళ్ళు రోగాలకెల్ల - వద్దీకీయకు॥

చ॥ 1. పిల్ల జల్లలను తెచ్చి - వీధి పెట్టకు ముసలి
తల్లితండ్రులను బట్టి - తిట్టి కొట్టకు ॥కల్లు॥

2. త్రుళ్ళి త్రోవలను నీవు తూలి పొడకు
బుద్ధి కాలువలో గలిపి - అవమాన మొందకు ॥కల్లు॥

3. తెల్లవాడి చూపులు - అది తిరుగును రింక నీవు
కల్లు మానితేను - చాలు కట్టుర శంక ॥కల్లు॥



## 7. దేశమాత సేవ చేయండి

-కొండపల్లి జగన్నాథదాసు

ప॥ దేశమాతా సేవ చేయండీ జనులార భారత
దేశ దాస్యము తొలగజేయండీ
దేశ భాగ్యము చూరగొనగా
లేశమనుమానింపకను పర
దేశ వాసులు చేయు - మాయ-
పాశముల పడి నాశమొందక॥

1. దేశవస్త్రంబులనే దాల్చండీ - జనులార మీరు, వి
దేశ, వస్త్రము లంటబోకండీ
దేశనాశనకరములగు - నీ వేష భాషల రోసి - మోహా
వేశమును బరిమార్చి, గాంధ్యుపదేశమును
మీ మదిని నిల్పియు ॥దేశమాతా॥

2. భోగముల కాసించ బోకండీ - స్వరాజ్య ప్రాప్తికి
త్యాగమును గావింప బూనండీ
అఖిల భారత సభల లోపల - బాగుగా మన భారతులచే
కనుగొనంబడు - కార్యసాధన - సాగజేయుట గుర్తెరింగియు ॥దేశమాతా॥

3. సందియంబులు చెంద బోకండీ - స్వరాజ్యమదిగో
తొందరగ చేకూర కలదండీ
అందరును దౌర్జన్య రహితంబైన సత్యాగ్రహోద్యమ
మందుచేరియు భక్తి తోడుత - వందే మాతరమని పఠించుచు ॥దేశమాతా॥

4. అంటరానీ తనమె లేదండీ - మన దేశ వాసుల
నందరిని నొకరీతి చూడండీ
కంటి కగపడు నిమ్న జాతుల - నంటికొన్నను దోసమనుచును
కంటగింపక కూర్మిమై, మీ వంటివారని మదితలంచుచు ॥దేశమాతా॥

5. తగవులన్నియు మానవలెనండీ - సర్కారు కోర్టుకు
తగుదుమని ఇక సాగిపోకండీ
తగిన పెద్దలు చెప్పు పగిదిని - జగడములనే దీర్చుకొనుచును
జగతి మెచ్చగ ఐకమత్యము - చాల సంపాదించి మీరలు ॥దేశమాతా॥

6. ధరనహింసా వ్రతము బూనండీ - శ్రీ గాంధి దేవుని
పాంచజన్యము పిలుపు వినరండీ
గరిమతో సారాయి మొదలగు - కైపు వస్తువులన్ని విడచియు
స్థిరమనంబున మీ ధనంబు స్వరాజ్య సమరంబున కొసంగియు ॥దేశమాతా॥

## 8. శ్రీగాంధి నామం మరువం మరువం

–దామరాజు పుండరీకాక్షుడు

ప॥ శ్రీ గాంధి నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం॥

చ॥ 1. కూడి భారతమాతా గొలుతాం గొలుతాం
నేడే స్వరాజ్యాన్నీ తెస్తాం తెస్తాం ॥శ్రీ గాంధి॥

2. దేశభక్తులు మాకు సారం సారం
దేశద్రోహులు మాకు దూరం దూరం ॥శ్రీ గాంధి॥

3. వరగాంధి మార్గాన్ని – వదలాం వదలాం
వేరే మార్గాలన్నీ వదిలాం – వదిలాం ॥శ్రీ గాంధి॥

4. లాఠీ దెబ్బలకేమో – బెదరాం బెదరాం
మెటీ తుపాకీకి బెదరాం – బెదరాం ॥శ్రీ గాంధి॥

## 9. స్వదేశ మాత

–దామరాజు పుండరీకాక్షుడు

ప॥ స్వదేశమాత – నీ పాదార విందముల్
సదామదిన్ భజించెదం – ముదంబు గూర్చుమా॥

చ॥ 1. వరాల తల్లి మా – మొరాల కింపుమా
బిరాన కనికరానగని వరాలొసంగుమా ॥స్వదేశ॥

2. స్వరాజ్య శంఖము – పూరించి గాంధిజీ
పరాయి ప్రభుత పారద్రోల ప్రతిన బూనెను ॥స్వదేశ॥

3. అహింస ఆయుధం చేబూని బాపుజీ
స్వాతంత్ర్య సమర యోధుడుగా కీర్తిగాంచెను ॥స్వదేశ॥

4. రాట్నంబు చక్రము – రక్షించు మనలను
కష్టమ్ములన్ని తొలగిపోయి శుభము కలుగును ॥స్వదేశ॥



## 10. మా కొద్దీ తెల్ల దొరతనము

–గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ మా కొద్దీ తెల్ల దొరతనము దేవా
మా కొద్దీ తెల్ల దొర తనము॥

అ॥ మా ప్రాణాలపై పొంచి –మానాలు హరియించె ॥మా కొద్దీ॥

చ॥ 1. పన్నెండు దేశాలు – పండుతున్నాగాని
పట్టెడన్నమె లోపమండీ – ఉప్పు
ముట్టుకుంటే దోషమండీ – నోట
మట్టి గొట్టి పోతాడండీ – అయ్యో
కుక్కలతో పోరాడి కూడు తింటామండి ॥మా కొద్దీ॥

2. వర్తకంబున కొచ్చి పట్టణంబుల పట్టి
రాజ్యమొక్కటి అల్లినాడు దాన్ని
రాణీ కప్పగించినాడు – రాణీ
పత్రమ్ము చించేసినాడు – ఈ
చిత్రమిదేమన్న శిక్షిస్తానంటాడు ॥మా కొద్దీ॥

3. కోర్టులంటూ పెట్టి – పార్టీలు పుట్టించి
స్నేహభావము చంపినాడు – ద్రవ్య
దాహము కల్పించినాడు – చెడ్డ
యూహలు కదు పెంచినాడు – మా
ఆహారముల ద్రుంచి ఆహా! యనిపించాడు ॥మా కొద్దీ॥

4. ప్రజల క్షేమం కోసం – పెట్టిన సంస్థల
ప్రభులకోసం మార్చేస్తాడు వాటిని –
ప్రజల శత్రులు చేసుతాడు
మమ్ము – గజిబిజిలాడ జేస్తాడు – వాడి
గడబిడ వర్ణింప కాదు బ్రహ్మకైన ॥మా కొద్దీ॥

5. నూట నలుబది నాల్గు నోటికి తగిలించి
మాటలాడ వద్దంటాడు – మమ్ము
పాట పాడ వద్దంటాడు – తనను
దాటివెళ్ళ వద్దంటాడు – అయ్యో!
చేటు తెచ్చుకు మమ్ము – చెడి పోవమంటాడు ॥మా కొద్దీ॥

6. ఘోర శాసనాలు కూడదీసి మాదు
సారములెల్ల పీల్చాడు – సం
సారము లెల్ల కూల్చాడు – మా
చీరల నెల్ల వొల్చాడు – బంగారము లెల్ల దోచాడు
వాడు – ధనవంతులను బట్టి తైతెక్క లాడ్తాడు ॥మా కొర్దీ॥

7. ధనము కోసము వాడు – దారి జేసుకొని
కల్లు సారాయమ్ము తాడు – మాదు
ముల్లె మూటలు దోచినాడు – అలి
మెళ్ళో పుస్తెలు త్రెంచినాడు – మాదు
కళ్ళల్లో దుమ్మేసి – కాటికి దరిచేశాడు ॥మా కొర్దీ॥

8. పంట బోయిన గాని – పన్నులు విడువక
వెంట కరణాలంపుతాడు – వారి
వెంట తహశీల్దార్నంపుతాడు – లే
కుంటే ఉద్యోగం తీస్తాడు – మా
ఇంటి లోపల ఇట్లు – ఇడుమల్లు పెడతాడు ॥మా కొర్దీ॥

9. ఏడాదికేడాది కెక్కువ శిస్తేసేసి
ఈ భూమి నాదేనన్నాడు – మమ్ము
కూలికి దున్నమన్నాడు – కడుపు
మంటతో చావమన్నాడు – అయ్యొ
బానిసలకు వాడు ప్రభువౌతానన్నాడు ॥మా కొర్దీ॥

10. స్వరాజ్య మందిర – స్థాపితమైనట్టి
జెండాలన్నియు పీకుతాడు – దేశం
ముండామొయ్య మంటాడు – వాడు
బండ తనము చూపుతాడు – ఈ
చండాలపు వృత్తి – స్వీకరించెను నేడు ॥మా కొర్దీ॥

11. దండు పట్టుకవచ్చి – తగుదునమ్మాయంచు
దార్ల వెంబడీ త్రిప్పుతాడు – జాక్
జెండా మీదికెత్తుతాడు – దానికి
దండాము – పెట్టమంటాడు – వాడి
గుండు బలము క్రింద – కూల రమ్మంటాడు ॥మా కొర్దీ॥

12. కయ్యానికి ముందు కాలు ద్రువ్వి వెనుక
దయ్యమై మము మ్రింగుతాడు – మాదు
నెయ్యము చెడగొట్టుతాడు – సేవ
కయ్యో పాపము గట్టుతాడు – అయ్యో
వెయ్యేల పోలీసు విధులు మరిపిస్తాడు ॥మా కొర్దీ॥



13. గాంధీ టోపీ పెట్టి పాఠశాలకు బోవ –
రావద్దు రావద్దంటాడు
రాట్నం బడిలో పెట్టవద్దంటాడు – టోపీ
తీసి వీపులు బాదుతాడు – వాడి
రాజద్రోహమంత రాట్నంలో ఉందంట ॥మా కొర్దీ॥

14. నూరు మంది మలబారు వాసులను
కూరినాడొక పెట్టెలోన – నోట
నీరు పోయడు దేవుడాస – గాలి
దూరనీయడించుకైన – వాడి
దారుణత్వమెట్టు – తరిమివైతువో దేవ ॥మా కొర్దీ॥

15. ప్రభువు గాంధితోడ భారతదేశ మాత
పరమ తపము చేసినాది ధర్మ
దేవత ప్రత్యక్షమైనాది కోరిన
వరములిస్తానన్నాది – ఆ
దొరల గుండెలలోన – దడదడా పుట్టింది ॥మా కొర్దీ॥

16. చూడియావుల కడుపు – వేడి వేడి మాంసం
వాడికి బహుయిష్టమంట – మాదు
పాడి పశువుల కోస్తాడంట – మా
మతము పాడు చేస్తాడంట – మా
చూడి యావుల మంద – సురిగి ఇంటికి రాదు ॥మా కొర్దీ॥

17. చిత్తరంజనుదాసు – చిన్నారు కొమరుని
చెయ్యి విరిచి చెర బెట్టినాడు – అతని
పెత్తనంబును – బట్టినాడు – వారి
ముత్తైదువుల పట్టినాడు – వారి
సొత్తుకు నిలమీద – చోటులేదన్నాడు ॥మా కొర్దీ॥

18. మా చీరాలను ఇష్ట చేరినాడు చూచి
సిగ్గును పొందబోడోయి – ఇంక
బీరాలు పలుకుతాడోయి – వాడి
దురాలోచనమెల్ల – ధూళిలో కలిసింది ॥మా కొర్దీ॥

19. వాడి తాతగారి ముల్లె – దాచిపెట్టినయట్లు
ధాటీచేస్తాడీ దేశమున – పోరాడ చూస్తాడా పైన – మో
మాటము పడదు సుంతైనా – వాడి
పాటు పాడైపోను – మాట చెబితే వినడు ॥మా కొర్దీ॥

20. తెల్ల దొరల సేవ - వల్ల బ్రతుకుట పెద్ద
నల్లమచ్చని యెంచరోయి - జాతి
కల్లా తప్పని యెంచరోయి - దైవ
మొల్లడంచు తల్పరోయి - భూమి
తల్లి యేడ్పులు వినరోయి - వారి
యుల్లమెల్ల సన్ని కల్లులైపోయాయి ॥మా కొద్దీ॥

21. ఎవరి అనుమతిపైన హిందూ దేశమునందు
పరిపాలనము పెట్టినాడు వీడు
ఎవరికీ జవాబు నీడు - ధర్మ
మార్గము నంటుకొనిపోడు - వీడి
దారుణత్వము కింక తగిన ఉడేలేదు ॥మా కొద్దీ॥

22. వాడి శాసనాలు మాడిపోను - వాటి
గోడియె మాకొద్దు తండ్రీ - ధర్మ
దేవుడే మా రక్ష సుండి - ప్రజల
ప్రేమయే మాకు దిక్కండీ - కష్ట
కాండమె మా పాలు సుండి, ఈ
సృష్టి మమ్మునూచి - సుందరమననిండి ॥మా కొద్దీ॥

23. దొరల బాధలు మాకు తొలగించుమో తండ్రి
నిరతము నినుగొల్తుమయ్య - నీదు
చరణ ధ్యానమె విడువమయ్య - మేము
మరువము మా ధర్మమయ్య - మేము
ఐకమత్యము తోడ అలరారుతామయ్య ॥మా కొద్దీ॥

24. గుండు పట్టుకు మమ్ము - కూల్చ వచ్చినగాని
కూర్చున్న చోటులు విడము - పాడు
కొంటూ రాట్నం - త్రిప్పుతాము - రాజ్య
సూత్రము వడి పడుకుతాము - దేవ
శాంతిని తప్పము - సంతసం విడువము ॥మా కొద్దీ॥

25. బాహ్మణా బ్రాహ్మణ - పంచమ బ్రాహ్మణ
భేదపు తెగలు మీకేల - మీ
భేదాలు వడి కాల్చరేల - చెడ్డ
బోధాలకు లొంగిరేల - యీ
మాధూకరపు వృత్తి - మరగినారది యేల ॥మా కొద్దీ॥

—



26. ఎవరెన్ని చెప్పిన - హిందూ దేశవాసు
లేక సోదరులె సుండీ - అంటు
దోషము మాకు లేదండీ - పాప
మంటూ చాటుదాము రండి - ఈ
కుంటి వాదనలు - గూటిలో పెట్టండి ॥మా కొద్దీ॥

27. రాట్నలక్ష్మి నవ్వు రంజిల్లు మోముతో
పాడు చున్నది నోటి నిండా - కరవు
మాడుచున్నది దానియెండా - స్వేచ్ఛా
తిరుగు చున్నది దానిగుండా - ఆ
దొరల తేజమెల్ల - తూల్చే జండాయుండ ॥మా కొద్దీ॥

28. ప్రాపంచ మెల్లను పట్టి పిండేటంత
పశు బలమువాడి కుందంట - దాన
వశపరచుతాడు మమ్మంట - మమ్ము
కసిదీర గొట్టుతాడంట - వాడి
శషబిష లెల్లను చెపుతాడు మా యింట ॥మా కొద్దీ॥

29. స్వేచ్ఛ తేజముతోడ - స్వేచ్ఛావధూమణి
కారా గృహమున వేచి ఉంది - పూల
గుచ్ఛములను దాల్చి యుంది - మీకు
ముచ్చటలను తెల్పుతుంది - యీ
చచ్చు రాజ్యము వీడి - సరిగ జైలుకు రండి ॥మా కొద్దీ॥

30. విచ్చలవిడిగాను విప్పి రెక్కలు మీరు
విహరింపవచ్చు మీ రచట - స్వేచ్ఛ
నిచ్చె నెక్కగ వచ్చు నచట - దైవం
మెప్పులందగ వచ్చునచట - తల్లి
కచ్చియున్న ఋణము - సర్పింపగావచ్చు ॥మా కొద్దీ॥

31. సకల దేశములార - సత్యవర్తన తోడ
సారించుడిటుల మీ దృష్టి - యింక
కనుడీ హైందవ పుష్టి - వేగ
తెరవు దొరకుట కొత్త సృష్టి - ఎట్టి
దండన లెదురైన - కాదు మాకు నష్టి ॥మా కొద్దీ॥

32. ధర్మపక్షము నేడు దారుణమైనట్టి
బడలిక పాలయ్యె నయ్య - దాని
వదలించు - కొనలేదయ్యా - నీదు
పదునగు ధార నీవయ్యా - నీదు
పదములపై వ్రాలి ప్రార్థించినామయ్య ॥మా కొద్దీ॥

33. ప్రపంచమున శాంతి - ప్రేమ దీపంబులు
వెలిగించే నీ దేశమంత - గాంధి
తెనిగించె నీ క్రొత్త వ్రాత - స్వేచ్ఛ
మొలిపించె మన శక్తి చేత - బలము
దుర్బలమను - భేదమెచ్చటను లేదు ॥మా కొర్దీ॥

34. మా పాపమునెల్ల బాపి రక్షించుమా
పాప నాశన ధర్మమూర్తీ - యిటుల
కోపముంచకు - న్యాయమూర్తీ - ఆప
దల బాపుమో చక్రవర్తీ - నీ
వ్యాపార మొకసారి - నెరపుము పృథ్విపై ॥మా కొర్దీ॥

## 11. నమోహిందుమాతా

ప॥ నమో! హిందుమాతా! సుజాతా!
నమో! జగన్మాతా! మాతా॥
అమోఘ దివ్య మహిమ సమేతా
అఖండవర భరత ఖండమాతా॥

చ॥ 1. విపుల హిమాద్రులే - వేణీ భరముగ
గంగా యమునలె - కంఠహారముగ
ఘన గోదావరి కటి సూత్రమ్ముగ
కనులకు పండువ ఘటించు మాతా॥ ॥నమో॥

2. గోలుకొండనీ రత్న కోశమట
కోహినూరు నీ జడలో పూవట
తాజమహలు నీ దివ్య భవనమట
అహోహో! నీ భాగ్యము మాతా॥ ॥నమో॥

## 12. రాట్నమును పూజింప రారండీ

ప॥ రాట్నమును పూజింప రారండీ ఈ
రాట్నమే యిలవేల్పు మనకండీ
రాట్నమే రతనాల మూటని
మాటి మాటికి పాట పాడుచు॥

చ॥ 1. రాట్న మాడిన రాజ్య మెచ్చును రాట్నమాడిన సిరులు హెచ్చును
రాట్నమాడిన దేశమునకే లోటు లేదను మాట తలచుచు ॥



2. నూలు పోగే మూల కనుచును తేలికగ నూహించకండీ
ఏకు మేకై తోడు పడి చీకాకు చేయును వైరి మూకల ॥

3. కదురు కవ్వము లాడుచోటున కరువుకాటకముండదని - మా
గాంధిజేసె హితోపదేశము కదురుగైకొని దీక్షబూనుడు ॥

## 13. ఏకులు కావలెనా

-వెన్నెలకంటి రాఘవయ్య

ప॥ ఏకులు కావలెనా దాస్యపు మోకులు కావలెనా
లోకులతో సరితూగుచు నిచ్చట వ్యాకులతను విడనాడి భుజించుటకు॥

చ॥ 1. కదురులు కావలెనా కొరడా బెదురులు కావలెనా
అదరక చెదరక అలజడి నొందక
కుదురుగా స్వరాజ్యము పొందుటకు ॥

2. పడుగులె కావలెనా సేవకు తొడుగులె కావలెనా
అడుగడుగునకును హరిభజియించుక
కడుగో గంజో కమ్మగ త్రాగుటకు ॥

3. వెన్నెల కావలెనా రాజుల మన్నన కావలెనా
వెన్నెలకంటి రాఘవరాముడు కన్నుల దెరువ మిమ్మెల్లర వేడెడి ॥

## 14. రాట్నలక్ష్మికి మంగళ హారతి

ప॥ రాట్న లక్ష్మికి మంగళం మా రాజ్యలక్ష్మికి మంగళం
కన్న బిడ్డల గాచి బ్రోచిన కదురు తల్లికి మంగళం
పాలు బోలిన నూలు నొసగే భాగ్యలక్ష్మికి మంగళం॥

చ॥ 1. భిన్న మతముల భిన్న కులముల భిన్న భాషా
భేదములను, భిన్నమయ్యెడు చిన్నబిడ్డల చేర్చు జననికి మంగళం ॥

2. దండి భారత భాగ్యసంపద - పిండిపీల్చిన, యంత్ర రక్కసి
మదమడంచగ - ఉదయ మొందిన - ఆదిలక్ష్మికి మంగళం ॥

3. జారిపోయిన దేశగరిమను - మీరిపోయిన దేశ సంపద
తిరిగి చేర్చగ తరలివచ్చిన - వర ప్రదాయిని మంగళం ॥

## 15. అచ్చపు దాస్యశృంఖలము

-దామరాజు పుండరీకాక్షుడు

అచ్చపు దాస్య శృంఖలములందు దగుల్కొని
చచ్చి, కృశించు, ఈ భారత జాతికి నూతన శక్తి దాతవై
వచ్చినయట్టి సూర్యభగవానుడ నీవు త్వదాగమమ్మునన్
విచ్చెను లెమ్ము, మా నయన వీధుల గ్రమ్మిన కారు చీకటుల్॥

## 16. కొల్లాయి గట్టితే

-బసవరాజు అప్పారావు

ప॥ కొల్లాయి గట్టితే నేమి మా గాంధి
కోమటై పుట్టితేనేమి?
వెన్నపూస మనసు – కన్న తల్లిప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు॥ ॥కొల్లాయి॥

చ॥ 1. నాల్గు పరకల పిలక నాట్యమాడే పిలక
నాలుగు వేదాల నాణె మెరిగిన పిలక॥ ॥కొల్లాయి॥

2. బోసి నోర్విప్పితే – ముత్యాల తొలకరే
చిరునవ్వు నవ్వితే – వరహాల వర్షమే॥ ॥కొల్లాయి॥

3. చక చక నడిస్తేను – జగతి కంపించేను
పలుకు పలికితేను – బ్రహ్మ వాక్కేను॥ ॥కొల్లాయి॥

## 17. గాంధి మౌనిని గొల్వరే

-కొండపల్లి జగన్నాథదాసు

ప॥ గాంధీ మౌనిని గొల్వరే – పామరులారా
గాంధీ మౌనిని గొల్వరే ॥

చ॥ 1. కాలము వ్యర్థముగ – గడపక నన్నని
నూలు తీయగను – రాట్నమును పెట్టుడీ వేగ॥ ॥గాంధీ॥

2. సీమగుడ్డలు కట్టి – సిగ్గెల్ల విడనాడి
సోమరులై తిరుగ – క్షేమము గల్గునే॥ ॥గాంధీ॥

3. రాగలదు మనకు స్వరాజ్య భోగము నేడే
త్యాగులై మీమీ యుద్యోగములు మానండి ॥గాంధీ॥

4. మురిపెంపుతో శ్వేత – ముఖుల కొల్వున చేరి
తరియింపలేరు యదార్థము నమ్మండి॥ ॥గాంధీ॥



## 18. నవ్వవోయీ నీవు గాంధి

-సారధి, కృష్ణ

ప॥ నవ్వవోయీ నీవు గాంధి – ప్రేమ సామ్రాజ్యాన తేలిపోయే నవ్వు
నవ్వవోయీ నీవు గాంధీ మహాత్మా గాంధీ॥

చ॥ 1. సత్య వ్రతంబులో – జనన మొందిన నవ్వు
శమ దమాదులలోన – శాంతి జెందిన నవ్వు
సత్యాగ్రహాగ్నిలో – నృత్యమాడిన నవ్వు
ముత్యాలు విరజిమ్ము – ముద్దయిన నీ నవ్వు ॥నవ్వవోయీ॥

2. పారతంత్ర్యమునెల్ల పారద్రోలే నవ్వు
స్వాతంత్ర్యమును సదా – వరలజేసే నవ్వు
రాజ్యసూత్రాలలో రంగు తేలిన నవ్వు
రాజ్యవేత్తలకైన రక్షణిచ్చే నవ్వు ॥నవ్వవోయీ॥

3. రాట్న గానంబులో – లయము నొందే నవ్వు
కదురు పాటలలోన – కలిసిపోయే నవ్వు
పూర్ణ స్వరాజ్యంబు – బోధజేసే నవ్వు
బోసినోటను వెల్గు – పాలుపైన నీ నవ్వు ॥నవ్వవోయీ॥

4. అరుణ కాంతిని గూడ – అవల ద్రోసే నవ్వు
చిత్రాబ్జముల యందు – చిందులాడే నవ్వు
సంఘ సంస్కారంబు సమకూర్చు నీ నవ్వు
ప్రత్యక్షముగ దైవ – బలము చూపే నవ్వు ॥నవ్వవోయీ॥

## 19. మమ్ముబ్రోవ మహిని వెలసితివా

-మంగిపూడి వేంకటశర్మ

ప॥ మమ్ముబ్రోవ మహిని వెలసితివా మహాత్మాగాంధీ
మమ్ముబ్రోవ మహిని వెలసితివా॥

చ॥ 1. క్రూరులైన బోయరులు – ఘోర కష్టముల బడిన
భారతీయుల బాములుడిపితివా
వారందరి మొరవిని – భారతీయుల బాములుడిపితివా ॥మమ్ముబ్రోవ॥

2. పంటలన్నియు మంటగలియగ
పన్నులీయగ లేని రైతుల
విన్నపమాలించి బ్రోచితివా
ఆకైరా ప్రజల విన్నపమాలించి బ్రోచితివా ॥మమ్ముబ్రోవ॥

3. సహాయ నిరాకరణ దీక్షా – సాధనము బూని
బానిసత్వము బాపనెంచితివా – మా భారతదేశపు
బానిసత్వము బాప నెంచితివా ॥మమ్ము బ్రోవ॥

## 20. కట్టుకొన్నది అంగవస్త్రము

–మక్కఖొట్ల సత్యనారాయణమూర్తి

ప॥ కట్టుకొన్నది అంగవస్త్రము – పట్టుకున్నది రాట్నచక్రము
పట్టుమని పదిమెతుకులైనా – పట్టకుండు కృశోదరముగల
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో॥

చ॥ 1. ధనము తృణముగ దలచి మెలగుచు
మనమునందైచ్ఛిక దరిద్రము
ననుభవించుచు దేశ సేవకు
తను వొసంగిన ఘన చరిత్రుడు
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో ॥కట్టుకొన్నది॥

2. రక్త పాత మొకింత లేకను – స్వ
శక్తినే బలినొసగు భక్తులను
కోట్లు కోట్లుగ సృజించిన యుక్తి మంతుడు శక్తిమంతుడు
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో ॥కట్టుకొన్నది॥

3. అర్థహీనపు మాటలాడడు
వ్యర్థముగ కాలమ్ము గడుపడు
స్వార్థ మన నేమో ఎరుంగడు
నిర్ధనులలో నిర్ధనుండగు
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో ॥కట్టుకొన్నది॥

4. సహన శీలము గగన పారము
మోయునది యా దేశభారము
విశ్వ మంతయు శాంతి బడయగ
నహింసా వ్రతమును బూనిన
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో ॥కట్టుకొన్నది॥

5. భూషణములకు తోషమందడు
దూషణములకు దోషమందడు
దోష భయమును కప్పిపుచ్చుడు
ద్వేషమందడు – శత్రువులపై
గాంధికంటెను సామ్యవాదులు కలరే లోకములో ॥కట్టుకొన్నది॥



## 21. రమారమణ గోవిందా

–మంగిపూడి పురుషోత్తమ శర్మ

ప॥ రమారమణ గోవిందా హరియని రండయ్యా జనులు
సమస్తమును గాంధీ మహాత్మునకు – సమర్పించి శమ దమాద్యులై॥

1. నరుండుగా నవతరించినాడట – నారాయణుడు నేడు
దురాపదల నంతరింపజేయు – స్వరాజ్య ఫలమిది తరింపజేయును ॥

2. నిరాయుధుడు, దుర్నిరీక్ష తేజుడు – దురం ధరుండితడు
స్వరాజ్య లక్ష్మిని బిరానతెచ్చెద – సరే రండనుచు ఖరారుచేసెను ॥

3. అహోరాత్రములు, మహామహులు బహు
సహస్రములు వచ్చి – జోహారు చేయుచు
సహాయ పడగ నసహాయ యోగమున వహించి మెచ్చెను
శ్రీమద్రమారమణ గోవిందా హరియని రండయ్యా జనులు ॥

## 22. వినరా ప్రియ సహోదరుడా

–గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ వినరా ప్రియ సహోదరుడా! సోదరుడా!
భారత భావి భాగ్య శేఖరుడా! ॥వినరా॥
గాంధి చెప్పిన త్రోవ నడురా – దేశ
ఘనుల పాలన మొక్క గడియ చేపడురా॥ ॥వినరా॥

చ॥ 1. సామాన్యుడనుకోకుమతనీ – దైవ
సంకల్పమురా వాని జనన మీ యవనీ॥
కాయంపు రుచి అణగద్రొక్కి ఆత్మ
కళచేత పట్టెను – కడగండ్ల దక్కీ॥ ॥వినరా॥

2. పరమతపమున గాని రాదు కార్య
పరత మాత్రమె దాని గాంచే నీ జోదు
కత్తిని నిరసించు సతము – స్వస్థ
చిత్త వృత్తియె వాని చేతి ఆయుధము॥ ॥వినరా॥

3. అహింసా వ్రతమును బూనీ – యూత
డవతరింపగ జేసే ఆర్యత్వమవనీ
ఈశ్వరత్వమె రూపుగాంచె – నిజము
శాశ్వత సుఖమునె – జనమెల్లగాంచె॥ ॥వినరా॥

4. దేశీయ విద్య వర్థిలురా – దుర
భ్యాసమ్ము లెల్లయు – బయనమై చనురా
నిమ్న జాతుల నెత్తుమోయీ – వారు
నీరసించిన ఎడల ఇక నీకు గోయి ॥వినరా॥

## 23. కమ్మగా బ్రతికితే

-కృష్ణశాస్త్రి

ప॥ కమ్మగా బ్రతికితే గాంధీ యుగం - మనిషి
కడుపునిండా తింటే గాంధీ జగం॥

చ॥ 1. పరమార్థ మెక్కటే గాంధీ మతం
భయము వదిలేయుటే - గాంధీ హితం - మనిషి
భయము వదిలేయుటే గాంధీ హితం॥ ॥కమ్మగా॥

2. భోగలోలత విడుటె గాంధీ విధం
త్యాగ రథమెక్కితే గాంధీ పథం - మనిషి
మర్యాదయే గాంధీ ధనం - మనిషి
మారితే కోవెలగ గాంధీ తనం॥ ॥కమ్మగా॥

3. తన కంఠమున దాచి హాలాహలం
తల నుండి కురిపించి గంగాజలం
మనిషి శివుడవటమే గాంధీ వరం - బాపు
ననుసరిస్తే చాలు మన మందరం॥ ॥కమ్మగా॥

## 24. జగద్రక్షకుడు

-మంగిపూడి వేంకటశర్మ

ప॥ జగద్రక్షకుడు గాంధిమహాత్ముడు - జనులందరు మీరెరుగండీ
జగతిని ధర్మము స్థాపన సేయగ - జన్మించిన హరి ఇతడండీ॥

1. హిందూ దేశమునుద్ధరించుటకు - హిందువుడై జన్మించెన్
హిందూ సోదరులారా మీరిది - డెందము లోపల దలచండీ ॥

2. స్వరాజ్య మర్మపు సంగతి నెరిగిన - శాస్త్రజ్ఞుండు ఇతడండీ
బిరాన మీరా మర్మపు సంగతి - విశదముగా నెరుగండీ ॥

3. అసహాయోద్యమ మంత్రము ధరలో - ఆ మహనీయుడు బోధించెన్
అసహాయోద్యమ గురుపదమ్ములు - అంది ముందు నడవండీ ॥

4. రాజకీయ వ్యవహారములో దిగి - రాజయోగియై తావెలసెన్
రాజులలో నితడగ్రగణ్యుడని - రంజిలుచుండెను భువిలో ॥

5. హేమాహేమీ లేమిసేయుటకు - యేమియు తోచక నుండి రహో!
ఏమీ స్వామీ నీ మహత్యమని - హిందువులుండగ సందడిగా ॥



## 25. గాంధి మహాత్ముడు బయలుదేరగా

-బసవరాజు అప్పారావు

ప॥ గాంధి మహాత్ముడు బయలుదేరగా
కల కల నవ్వింది జగత్తు - కల కల నవ్వింది॥

1. గాంధి మహాత్ముడు చక చక నడువగ
కంపించి పోయింది భూదేవి కంపించిపోయింది॥ ॥గాంధి॥

2. గాంధి మహాత్ముడు కన్ను విప్పగా
గడ గడ వణికింది అధర్మము
గడ గడ వణికింది ॥గాంధి॥

3. గాంధి మహాత్ముడు - నవ్వు నవ్వగా
కన్నుల గట్టింది - స్వరాజ్యం కన్నులగట్టింది॥ ॥గాంధి॥

4. గాంధి మహాత్ముడు గొంతు విప్పగా
గణ గణ మ్రోగింది - ప్రణవము
గణ గణ మ్రోగింది! ॥గాంధి॥

5. గాంధి మహాత్ముడు స్వస్తి పాడగా
కరముల దొరికింది - మోక్షము
కరముల దొరికింది! ॥గాంధి॥

## 26. కట్టకురా సీమగుడ్డ

-కొండపల్లి జగన్నాథదాసు

ప॥ కట్టకురా సీమగుడ్డ - యిటు పైన
కట్టనను చు ఒట్టు పెట్టరా బిడ్డ॥ ॥కట్టకురా॥

1. మనజాతి మన మతము మాటను మరపించి
మత భ్రష్ట చేసెడి - మాయ సీమగుడ్డరా ॥కట్టకురా॥

2. అన్నదమ్ములనక - ఆలు బిడ్డలనక
ఐకమత్యము చెరచు - ఆ సీమ చెడు బట్టరా! ॥కట్టకురా॥

3. వడుకు నూలు బట్ట వడుపైన యేడి బట్ట
వదలిపెట్టి తెల్లవారి - మైలబట్ట ॥కట్టకురా॥

4. మానముగాచెడి మన బట్టలను మాని
మానము చెరచెడి మాయమల్లు బట్ట ॥కట్టకురా॥

5. గాంధి మహాత్ముండు కరుణా సాంద్రుండు
కవి వరదుని బోధ కనులనద్దికొని ॥కట్టకురా॥

## 27. దండాలు దండాలు

-వద్దాది సీతారామాంజనేయులు
-పూడిపెద్ది కాశీవిశ్వనాథశాస్త్రి

ప॥ దండాలు దండాలు భారతమాతా అవి
అందుకోని దీవించు భారతమాతా॥

చ॥ 1. గాంధీ మహాత్ముండు భారత మాతా నీ
ముద్దు కొడుకుండంగ భారతమాతా
మాకేమి భయము లేదు భారతమాతా
మాకేమీ కొదవ లేదు భారతమాతా ॥దండాలు॥

2. తెల్లోళ్ళుంటుండగానే భారతమాతా మాకు
చిప్పచేతి కొచ్చిందే భారతమాతా
దండాలు దండాలు భారతమాతా అవి
అందుకోని దీవించు భారతమాతా

3. మూడు వందల ఏండ్లక్రింద భారతమాతా అల్ల
కుంపినోడు దిగినాడే భారతమాతా
దిగి యూరకున్నాడా భారతమాతా మా
దేశమంత దోచుకెళ్ళే భారతమాతా ॥దండాలు॥

4. వర్తకాని కంటు వచ్చి భారతమాతా ఆడు
పెత్తనమ్ము చేసినాడే భారతమాతా
చీలదీసి రాజ్యాలు భారతమాతా ఆడి
జోలె నింపుకొన్నాడే భారతమాతా ॥దండాలు॥

5. ఈతచెట్లన్నీని భారతమాతా ఆడి
తాతగాడు పాతినాడా భారతమాతా
మా రాజని మొరబెడితే భారతమాతా మరి
రెండు తన్నుమన్నాడే భారతమాతా ॥దండాలు॥

6. కఱ్ఱలైన కొట్టకుండ భారతమాతా మా
కత్తికూడ లాగినాడె భారతమాతా
భూమి దున్ని బ్రతుకపోతె భారతమాతా ఎంత
పెద్ద పన్ను వేసినాడే భారతమాతా ॥దండాలు॥



7. అడవులన్నీ ఆడివయ్యె భారతమాతా
అడుక్కు తినడం మాదయ్యె భారతమాతా
భోగమంత వాడిదాయె భారతమాతా
బాధలన్నీ మావాయె భారతమాతా ॥దండాలు॥

8. తీపి తీపి మాటలకు భారతమాతా మా
పెద్దలంత మోసపోయె భారతమాతా
గుండెల్లోనూ మాకు భారతమాతా ఆడు
పిరికిమందు పోసినాడే భారతమాతా ॥దండాలు॥

9. అందరు కలిసి యుండకుండ భారతమాతా ఆడు
ఇడదీసి యేలుతాడే భారతమాతా
చదువుకొన్న పెద్దలంతా భారతమాతా మా
కొంప తీస్తున్నారే భారతమాతా ॥దండాలు॥

10. కొత్త బాస తెచ్చినాడే భారతమాతా మా
బాసలన్ని రూపుమాసె భారతమాతా
మాయదారి సదువు సదివి భారతమాతా
నీ మాట తలచుకొనరె భారతమాతా ॥దండాలు॥

11. దేశబాస నేర్చుకోడం భారతమాతా ఎంతో
దోసమని తలుస్తారె భారతమాతా
అమ్మమ్మా ఎంత ద్రోహం భారతమాతా నీకు
సేయదలచుకొన్నారే భారతమాతా ॥దండాలు॥

12. పేరెన్నికగన్న తల్లి భారతమాతా నీ
శక్తి మరచిపోనారే భారతమాతా మా
తొంటి సదువు మాకిచ్చి భారతమాతా ఈ
దగా బుద్ధి పోగొట్టు భారతమాతా ॥దండాలు॥

## 28. పాలసముద్రమే

-దాశరథి

పాల సముద్రమే నడచి వచ్చిన రీతి హిమాచలాగ్ర శృంగాలు, కరాలు సాచి మనకై యరుదెంచిన ఖ్యాతి, శాంతి సత్యాలు మనుష్య రూపమును దాలిచి నేలకు దిగ్గినట్టు, గాంధీ లలితాత్మ దుజ్జ్వలమతిన్ భరతావనిపైన కాలిడెన్॥

## 29. మరువకు దార్యులారా

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ మరువకు దార్యులారా - పంజాబు వధలు॥

చ॥ 1. మానవతీమణుల కోకలు వొలిచియు
చేసిన అవమానం ఇక చెప్పగరాదు ॥మరువకు॥

2. ఏ పాపమెరుగని కడు చిన్ని పాపల
కొరదాల్తో కొట్టిరిగా కరుణైనా లేక ॥మరువకు॥

3. క్రూరుడో దయ్యరు గర్భిణీ స్త్రీలను
బూటుకాళ్ళతో కుమ్మెను గోటని తాను ॥మరువకు॥

4. చుట్టూ గేటులు మూసి పట్టి గుండ్లతొ కొట్టి
నెత్తుటేరుల నీదెను తన మెప్పు కొరకు ॥మరువకు॥

## 30. కొయ్యోడా పదం

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ కోటి యింతలు సెబుతానో రయ్యో కొయ్యోడా
నువ్వు కయ్యాలాడక చెప్పే కథను
కడదాకాను ఇంటావురో రయ్యో కొయ్యోడా
నే చెప్పిన దెల్లా ఇని తర్వాత తప్పులుంటే తిట్టరో రయ్యో కొయ్యోడ ॥

చ॥ 1. సీమానుంచీ పెబువులొచ్చీ సేతు బిరిచీ కట్టారో రయ్యో కొయ్యోడ
సేతులతోటీ రాయకూడదు సెప్పాకూడదు నోటితో
కాళ్ళాతోటీ యేఉకొడిలి పారుగూరెళ్ల కూడదురో రయ్యో కొయ్యోడ
ఒత్తీలంగ మనకింక ఏదీ త్రోవలేదురో రయ్యో కొయ్యోడా ॥

2. కత్తి బలము హేయంబంటు గాంధీ సెప్పినాడురో రయ్యో కొయ్యోడ
వాని మాట బ్రహ్మమాట దానిమీర రాదురో
పచ్చనైనా హిందూరాజ్యం బిద్దలైపోయిందిరో రయ్యో కొయ్యోడ
వెచ్చనైనా బాష్పములు - వేగ వేగ కూర్చరో రయ్యో కొయ్యోడ ॥

3. దేవతలొచ్చి సీటికి మాటికి తిరుగుచుండె రాజ్యంరో రయ్యో కొయ్యోడ
కిన్నెరలొచ్చీ పాటలు పాడే - కీర్తివంత రాజ్యమురా
విద్యాధరులు వీణలు పాడే-వీనుల విందు రాజ్యంరో రయ్యోకొయ్యోడ
గంధర్వులకు సుందరమైన కన్నులపండుగరాజ్యంరో రయ్యో కొయ్యోడా



4. వెండికొండ పసిడీ కొండ వెలసినట్టి రాజ్యమురో రయ్యో కొయ్యోడా
ముమ్మూర్తులకు ముఖ్యమైన మూలస్థానంరాజ్యమురా
కమ్మని గాలీ వీచే మంచి గంధపు కొండ రాజ్యమురో రయ్యో కొయ్యోడా
అదె వన్నెవాడి, సన్నగిల్లి చెన్ను తరిగి యున్నదిరో రయ్యో కొయ్యోడ ॥

## 31. ఈ జన్మమిక దుర్లభమురా

-బసవరాజు అప్పారావు

ప॥ ఈ జన్మమిక దుర్లభమురా
ఏ జన్మ సుకృతమో - ఈనాడు బ్రతికుంటి॥

చ॥ 1. ధర్మదేవతమూర్తి - తాల్చింది గాంధిగా
కళ్ళార మనమతని - గాంచి ధన్యులమైతి ॥ఈ జన్మ॥

2. భారతలక్ష్మికీ - భాగ్యరేఖా గాంధి
అతడె మన నాయకుండాయె నెంతటి భాగ్య ॥ఈ జన్మ॥

3. ఈ శోభగను భాగ్య - మే నోము పంటయో
ఈ యజ్ఞముల బాపు - ఏ పుణ్య ఫలమో
ఈ జన్మమిక దుర్లభమురా ॥ఈ జన్మ॥

## 32. గాంధీలాలి

-కొండపల్లి జగన్నాథదాసు

ప॥ గాంధీ లాలీ! మోహన గాంధీ లాలీ
కరుణా సాంద్రా మోహన దాసా గాంధీ లాలీ॥

చ॥ 1. నిదురమాని హారముమాని నీవు మా కొరకు
కదురు రాట్న మెన్నాళ్ళీ గతి ఖైదున త్రిప్పెదవు ॥గాంధీ॥

2. ఎర్రవాడ చెరసాల నీకు ఇల్లయిపోయినదా
ఏలిన వాడవు నీదు మోము - ఎన్నడు జూతుమురా ॥గాంధీ॥

3. కల్లుమాని ఇల్లాలిని గౌరవింతుమురా
మల్లుమాని మాయా మోకుల మాటా మరతుమురా ॥గాంధీ॥

4. పంచమాదుల మరచీనామని పంతము బూనకురా
పంచమదోషము పాలింపకురా - పవ్వళించుమురా ॥గాంధీ॥

## 33. వందే మాతరం

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ వందే మాతరం! వందే మాతరం!
వందే మాతరమని భారత వర్షంబును నుతియించెదము
సందేహంబులు మాని సమాన - స్వాతంత్ర్యంబును బడయుదము॥

చ॥ 1. కులభేదముల జాతిభేదముల గోతులలో పడకుండుదము
సలలితమగు నొకలక్ష్యము పెట్టుక సత్యము తోడుత మెలుగుదము ॥

2. పోరాటంబులు మాని స్వదేశము పొలుపారగ పూజించెదము
ఆరాటంబులు పెట్టెడి పరులకు - సడలక విజయము పొందెదము ॥

3. వేదములు ధనుర్వేదములు ధన వేదంబులు పఠియించుదము
భూదేవుల వలె జగమున సౌఖ్యము - పుణ్యంబును వెదజల్లుదము ॥

4. భారతదేశపు కీర్తిని దిక్కుల ప్రబలెడి రీతిన జేయుదము
చేరి విదేశీయులు మన తల్లికి చేతులు మోడ్పగ జేసెదము ॥

## 34. వందనమిదె గైకొనుమీ

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ వందనమిదె గైకొనుమీ - భారత జననీ
భారత జననీ మా పాలిటి రాణీ॥

చ॥ 1. నందనుల బ్రోవుమీ ఆనందదాయినీ
ఆనందదాయినీ మునిబృంద వందినీ
ముప్పది కోట్ల జనమునకు మూలమాతవు
మూల మాతవు మాపాలి నేతవు ॥వందన॥

2. మాదు భాగ్యములకు నెల్ల మహిత కర్తవు
మహిత కర్తవు మా యఘ విహర్తవు
ఉపనిషత్తు లుద్భవించె యుదరమందున
ఉదరమందున, అవి నిదుర చెందునా ॥వందన॥

3. సకలపురాణేతిహాస - సారభరితవు
సారభరితవు ఓంకార మహితవు
సకల సంపదలకు నీవు సంగ్రహంబవు
సంగ్రహంబవు గర్వ సంహారంబవు ॥వందన॥

4. యుద్ధశకము మాన్పునట్టి బుద్ధిశాలివి
బుద్ధి శాలివీ అనిరుద్ధ ప్రజ్ఞవీ
స్వరాజ్య దీక్షగొనిన నీవు సత్యమూర్తివి
సత్యమూర్తివీ అసహాయ వర్తివి ॥వందన॥



## 35. కలగంటి కలగంటిమీ

-అత్తిలి సూర్యనారాయణ

ప॥ కలగంటి కలగంటిమి మనోరథ
ఫలము నెమ్మది గంటిమీ
కారు మబ్బులు వీడి క్రమముగ దెసలకు
బారుట కనుగొంటిమీ॥

చ॥ 1. మాతను కనుగొంటిమీ బంధములెల్ల
మాయమౌటను గంటిమీ
దేహమంతయు కొత్త చైతన్యమును బూని
తేజరిల్లగ గంటిమీ ॥కలగంటి॥

2. సంద్రము కనుగొంటిమీ అలలూలేని
జలముల కనుగొంటిమీ
భారతీయులు గూడి ఐకమత్యముతోడ
పడవ నడుపగ గంటిమీ ॥కలగంటి॥

3. వీచుట కనుగొంటిమీ స్వేచ్ఛావాయువు
లొచ్చి పలకరింపగ వింటిమి
తెల్లవారగ గంటిమీ కలలోనివన్నీ
కన్నులారా గంటిమీ ॥కలగంటి॥

## 36. విజయీభవ

-శశాంక

ప॥ విజయీభవ! విజయీభవ! విశ్వప్రియ హృదయా
విజయా దిగ్విజయా - నవ వీర భారతీయ॥

చ॥ 1. హిమగిరి శిఖరమ్ము రీతి - ఉన్నత మస్తకము నెత్తి
భారతీయ తత్వమును - ప్రపంచాని కెరిగింపుము ॥

2. కొండల గుండెలను గరచి - గంగా తోయమ్ము చిలికి
మానవ హృదయాల ప్రేమ - సస్యమ్మును పండించుము ॥

3. కులమత ద్వేషములు లేక - ఐక్యత మాకు నేర్పించి
చెలియలి కట్టగ నిలబడి - శాంతి సత్య మెలయింపుము ॥

4. ఎల్లల నన్నిటినీ చెరిపి - ఏకమైన నీ సంతతినీ
ఏకచ్ఛత్రమ్ము పట్టి - ఉప్పితార్థ మొనరింపుము ॥

## 37. వినుడీ! వినుడీ! జనులారా

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ వినుడీ! వినుడీ! ఓ జనులారా విని
ధన్యత నొందుడి జనులారా
పతిత పావనుడు పురుషోత్తముడగు
గాంధీ మహాత్ముని ఘనసందేశము॥

చ॥ 1. ఖద్దరు కట్టుడి జనులారా మన
కలిమి బలిమి అది జనులారా
రాటముగొని ఆరాటముడిగి - పో
రాటము లేకను పొంది సుఖాంతము ॥వినుడీ॥

2. గ్రామోద్ధరణకు జనులారా - ఇక
గడగుదమండీ జనులారా
నిప్పచ్చరముల నిలయము లాయెను
పడిన వృత్తులను పైకి తీయుదము ॥వినుడీ॥

3. పంచమ జాతిని జనులారా - మన
పక్షము గొందము జనులారా
మత మనగను మన ఆత్మోన్నతికే
మానవైక్యతను మాననేర్పడదు ॥వినుడీ॥

4. చేతి పనులుడుగ జనులారా - మన
ఖ్యాతి నశించెను జనులారా
హస్త నిపుణతను ధ్వంసము చేసిన
పరుల చేతలకు బానిసలగుదుము ॥వినుడీ॥

5. సత్య మహింసలు జనులారా - మన
శస్త్రాస్త్రములో జనులారా
సమయము గనుగొని సత్యాగ్రహమున
స్వాతంత్రంబును సంపాదింతము ॥వినుడీ॥



## 38. అదిగదిగో జయధ్వజం

-వానమామలై వరదాచార్యులు

ప॥ అదిగదిగో జయధ్వజం అదిగో భద్రగజం
నదించునదొ జైహిందని నవయుగ సోదరవ్రజం॥

చ॥ 1. పొండీ ఎత్తండి సురల్ - పూలు కురియ జయధ్వజం
దండోరా వేయునదో - తరలుచుండె భద్రగజం ॥అదిగదిగో॥

2. ఇదియే మన జయధ్వజం - ఇది మన ఆత్మల తేజం
ఇదియే మన జాతి నిజం - ఇది భారత సురభూజం ॥అదిగదిగో॥

3. మన జవాన్ల రక్తబలం - మన కిసాన్‌ల పంటపొలం
మన విద్యా గాంగజలం - ధ్వజమెత్తె త్రివర్ణములన్ ॥అదిగదిగో॥

4. మన ధైర్య స్థయిర్యములిటు మహినచంచలత నిలిచెన్
మన మతవర్గ సమైక్యత - పెనవేసుక ఇటు నిలిచె ॥అదిగదిగో॥

5. ఆ ధ్వజమును తమిగాంచుడు - అతి భక్తిని తలవంచుడు
ప్రాంజలినిడి తను ధనహృత్ ప్రాణమ్ముల అర్పించుడు ॥అదిగదిగో॥

## 39. భరతమాతా పిలుపు

-కొండపల్లి జగన్నాథ దాసు

ప॥ భరతమాతా పిలుపు వినుమన్నా ఇక
తడవు లేదు మరణమైనను సిద్ధమగుమన్నా॥

చ॥ 1. భరతమాతా పిలుపు విని పరిభవంబుల తలచుకొని ము
ష్కరపు దాస్యపు శృంఖలము - నిష్కర్షగా తెగత్రెంచ వలెనిక ॥భరత॥

2. మాటలకు సమయమ్ము కాదన్నా శ్రీ గాంధి పల్కెదు
మాటవిని రంగమున దూకన్నా
మాటలకు సమయమ్ము కాదు సమాన ధైర్యము బూనిశాంతము
దాటకను మన వైరిమోహపు కోటలను పడగొట్ట వలెనిక ॥భరత॥

3. కడుపు కోసము చూచుకోకన్నా మృగములకు సైతము
కడుపు నింపును దేముడోయన్నా
కడుపు కోసము మనసు చంపక పడుపు వృత్తిని మానివేసియు
కడకు మానవ కోటిలో వెలిబడెదనని గుర్తెరిగి ఇప్పుడె ॥భరత॥

4. గుండు దెబ్బకు జంకబోకన్నా చొక్కాను దీసి
గుండె దానికి పందెమిడుమన్నా
గుండు దెబ్బకు జంకిలేను అఖండ తేజము పోయి పిరికి
గుండెవాడని పదుగురును ప్రచండ తరముగ తూలజూతురు ॥భరత॥

## 40. ఉయ్యాలా! జంపాలా

-కవికొండల వెంకటరావు

ప॥ ఉయ్యాలా జంపాలా! భారత నవజీవన బాలా!
పూరిత సత్యాగ్రహశీలా! పరిభవ దుఃఖిత పాంచాలా॥

చ॥ 1. తొలినాటి వేదాలు పులివో నీ చనుబాలు
మరునాటి కావ్యాలు - కమ్మగుత్తైన గూళ్ళు ॥ఉయ్యాల॥

2. శ్రీరామాయణ కథలు - ఊకొన్న వాక్సుధలు
భారతగీతా రుతము - చిందాయి అమృతమ్ము ॥ఉయ్యాల॥

3. పాశ్చాత్యమ్ మోహాంధమ్ - ప్రాచీనం ప్రియ బంధమ్
అధ్యాత్మమ్ కల్యాణం - స్వాతంత్ర్యమ్ శతమానం ॥ఉయ్యాల॥

4. ముజ్జగపు దీవెనలు - ముప్పది కోటుల జనులు
జయ జయ వాద్యోన్నతులు - జేజేల హారతులు ॥ఉయ్యాల॥

## 41. మన ప్రియమైన త్రివర్ణ పతాకా

-మల్లవరపు విశ్వేశ్వరరావు

ప॥ మన ప్రియమైన త్రివర్ణ పతాకా
విజయ ధ్వజమై ఎగయును గాక॥

చ॥ 1. నిత్యశక్తిదాయిని ఈ జెండా - వీరహృదయ మోదిని ఈ జెండా
ప్రేమసుధా వర్షిణీ ఈ జెండా - మాతృభూమి శ్రేయమ్ములు పండా ॥

2. ఈ జెండా శౌర్యపు నిలయమ్ము - దీని యండ నొసగిన ప్రాణమ్ము
పొందుదు మపుడే దిగ్విజయమ్ము - నెరవేర్తుము వీరుల శపథమ్ము ॥

## 42. ఏ నివసించెడి భూమికి సాటి

-గరిమెళ్ళ సత్యనారాయణ

ప॥ ఏ నివసించెడి భూమికి సాటి - ఇలను నెచట కలదా
జ్ఞాన సంపదల గనియని దాని గణనసేయవలదా॥

చ॥ 1. శ్రీకృష్ణుండవతారమెత్తిన - చిన్మయమగు సీమ
లోకమునకు కల్యాణము గూర్చిన - లాలిత గుణధామా ॥ఏ నివ॥

2. జనకు నాజ్ఞ తలదాల్చి రాజ్యమును - తమ్మునకర్పించి
వనమున కేగిన రామభద్రుడే - వసుధనె జన్మించె ॥ఏ నివ॥



3. దేశ స్వతంత్రపు కోటయౌ తిలకు - దేమునకిది తల్లీ
లేశపు గుణములు లేని మహాత్ముని - వాసము మా తల్లీ ॥ఏ నివ॥

4. కాసు సహితముగ ప్రజల కొసంగిన దాసున కిది మాత
దేశ సేవయే వ్రతమౌ లాలాజీని గన్న నేత ॥ఏ నివ॥

5. అసువుల నైనను లక్ష్యము చేయని - ఆలీలను గాంచె
విసుగక తననే గొలచెడి ఆంధ్ర - వీరవరుల పెంచె ॥ఏ నివ॥

6. కోటి జనములకు అన్నం బిడియెడి కొమ్మ అన్నపూర్ణ
పాటక జనముల పాలి కల్పకము - పరమ దయా పూర్ణ ॥ఏ నివ॥

7. పాట పద్దెముల నామెనె సతతము - ప్రస్తుతి చేసెదము
నీటుగ మన జీవితముల నామె సన్నిధి నర్పించెదము ॥ఏ నివ॥

## 43. భారతదేశము నాదని

-కొనకళ్ళ వెంకటరత్నం

ప॥ భారతదేశము నాదనీ - ఛాతీ విరుచుక పలుకన్నా భువి
ఏకడనైనా చేవగలదు నీ వెంతని తీవిగ నిలుమన్నా॥

చ॥ 1. మోహనగాంధీ కోసి నవ్వులిట - పోషాళించెనని తెలుపన్నా, ఆ
కర్మ భూమిలో జననము నాదని ఖండాంతరముల చాటన్నా ॥

2. చిటారు కొమ్మల కొసల మహాత్ముని చెయిద్రుంచిన రసఫలమన్నా,అది
నాది కాదను వివాదములో రుచి - నాణెమెరుంగనె లేరన్నా ॥

3. అణువణువున జీర్ణించుకొన్న ఒక - అమృతవాణి గంభీరతలె నీ
భవితవ్యపు గడియలలో రింగని - ప్రణవాకృతులై పలుకన్నా ॥

## 44. వాడే వైష్ణవుడు

-తుమ్మల సీతారామమూర్తి

వైష్ణవ జనతో తేనె కహియెజె పీడ్ పరాయీ జాణేరే॥

ప॥ వాడే వైష్ణవుడని పలుకదగు వాడే వలయును జగమునకు॥

అ॥ ఇతర జీవులను బాధించెడు వెత లెరిగి జాలిపడు వాడెవడో ॥

చ॥ 1. ఒరుల దుఃఖముల దీర్చిన పిమ్మట గర్వము నొందని వాడెవడో
అణకువతో ప్రజ కంజలి సేయుచు అన్యుల దూరని వాడెవడో ॥

2. తలపులు పలుకులు ఒకటై తల్లికి ధన్యత కూర్చిన వాడెవడో
సమతనంది యాశలు విడి పరసతి జననిగ నెంచిన వాడెవడో ॥

3. దబ్బర లాడక లాతి వారి సిరి తాకక నిలిచిన వాడెవడో
మాయా మోహము లణగి విరాగము మదిలో నిండిన వాడెవడో ॥

4. తెలిసి రాముని పేర్విని తనువే తీర్థము చేసిన వాడెవడో
కపటము లోభము కామము క్రోధము కడచి మెలంగెడి వాడెవడో ॥

## 45. ఎత్తండీ! ఎత్తండీ! స్వాతంత్ర్యపు జెండా

-కృష్ణశాస్త్రి

ప॥ ఎత్తండీ ఎత్తండీ స్వాతంత్ర్యపు జెండా
ఎత్తవోయ్! ఎత్తు ఎత్తు ఆకాశం నిండా॥

చ॥ 1. కేలూపుచు తల ఊపుచు గాలిదారులంట
మన జెండా మనదే వీరుల నెత్తురు పంట
కొత్త వేడి కొత్త వాడి భరతావని నిండా ॥ఎత్తండి॥

2. అర్థమత్తు లహంకృతులు అంధమతులు రాని
నిరుపేదలు నిర్భాగ్యులు నిరంకుశులు లేని
కొత్త జగం కొత్త యుగం భరతావని నిండా ॥ఎత్తండి॥

3. కులందాటి మతం దాటి కొద్ది గొప్ప దాటి
సమభోగం సమభాగ్యం సమ సంస్కృతి నాటి
కొత్త శాంతి కొత్త కాంతి, భరతావని నిండా ॥ఎత్తండి॥

## 46. పెట్టరే రాట్నము

-నెల్లూరు వెంకట రామానాయుడు

ప॥ పెట్టరే రాట్నము పెట్టరే ఓ తల్లులారా!

చ॥ 1. పెట్టరే మీరింకనైనా – పేదతనమున తల్లి వ్యథచే
కట్టుకొనుటకు బట్టలేకను – కడు విచారము నొందుచున్నది ॥పెట్టరే॥

2. కనుల భాష్పపు కణములలర – కడు విచారపు మోముతో
కన్న సంతానమ్ము దలచుక – చిన్నబోయెడి తల్లి మొరవిని ॥పెట్టరే॥

3. కాటకంబులు తొలగు, దాస్యము కదలికేగును భాగ్యమబ్బును
బూటకంబగు నాగరికమీ నాటికైనను తొలగు గావున ॥పెట్టరే॥

4. మూడు కోట్ల రాట్నములు ఆ – నాడు కల్గిన దేశమకట
నేడు చిత్రము దోచునొక్కటి – గూడ లేదిది యేమి పాపమొ ॥పెట్టరే॥

5. ఇట్టి రహస్యంబు బైటను – బెట్టి మనల స్వదేశి బట్టల
గట్టుకొనునటు జేసినట్టి – గాంధి ఋషికిని చేతులెత్తి ॥పెట్టరే॥



## 47. దేశభక్తి కనరా

-అత్తిలి సూర్యనారాయణ

ప॥ దేశభక్తి కనరా అదిగో – తెల్లవారె లేరా॥

చ॥ 1. స్వేచ్ఛ నొందమేలు ఇతరుల – సేవ చీకు వాలు
పరుల సేవయును పాదు రోగమున-పొరలెడు వారికి పరమౌషధమిది

2. అందరమును ఒకటే – మనుజుల హక్కులన్నీ ఒకటే
తమ తమ హక్కుల తలపని వారల-కన్ను తెరచెడి కాటుక యౌనిది ॥

3. దేశభక్తినమ్మి నడచిన తెగులు లేదు సుమ్మీ
పారతంత్ర్యమున బడు దేశములకు – జీవమిచ్చు సంజీవని ఇదియే ॥

4. సత్యమెడల వలదు మనమున శంక నిలుప వలదు
విశ్వాసంబే విశ్వము గెలుచును – విశ్వాసము విశ్వేశ్వరు చిహ్నము ॥

5. ద్వేషమెంచబోకు మదిలో ప్రేమ వదలబోకు
ద్వేషము చేతను ద్వేషము గెల్వదు–అనుచు నేర్పడే ఆర్యుడు బుద్ధుడు ॥

## 48. కర్మయోగి

ప॥ కర్మయోగి ప్రపంచ కల్లోలములు బాప
గల శాంతి దూత మా గాంధీ
ధర్మ సంస్థాపనార్థమె వచ్చినా పరాత్పరుడె ఈ విశ్వసంబంధీ॥

చ॥ 1. చాలిచాలని ముదక నూలుగుడ్డా గట్టి
సామ్రాట్టులను ధిక్కరించె
డాలు వాలు లేని ధర్మ యుద్ధము నొక్క
దాని నూత్నముగ సృష్టించె ॥కర్మయోగి॥

2. వేలకొలదిగ శాంతి వీరులను జగమెల్ల
విశ్రాంతి నొంద నేర్పరచె
చాల బలవంతులౌ సామ్రాజ్యవాదకుల
సాహసంబున తానె ఎదిరించె ॥కర్మయోగి॥

3. కోరి తాను దరిద్ర – నారాయణుని
సేవకుండనుచు బలుకు నాతండు
పారతంత్ర్యము లోన బడి క్రుమ్మగ్గ
ప్రజ కాప్త బాంధవుండై యొప్పుచుండు ॥కర్మయోగి॥

4. ఉద్యోగ రహితులై విద్వేష భరితులై
యుద్ధాల బడి చావకుండ
నిర్ధారణ జేసె నిర్మాణ కార్యముల
నెల్ల విబుధులు మెచ్చుచుండ ॥కర్మయోగి॥

## 49. సర్వ ప్రపంచమందు

-మల్లవరపు విశ్వేశ్వరరావు

ప॥ సర్వ ప్రపంచమందు శ్రేష్ఠమ్ము భారతమ్మే
ఈ నందనమ్మునందు కల కోకిలలము మనమే
కల కోకిలలము మనమే॥

చ॥ 1. అత్యున్నతమ్ము హిమనగము - అండగా నిలిచె మనకు
అండగా నిలిచె మనకు

నిత్యమ్ము రక్షనొసగీ కాపాడు మనల సతము ఈ
నందనమ్మునందు కల కోకిలలము మనమే
కల కోకిలలము మనమే ॥సర్వ॥

2. మన దేశమాత ఒడిలో ప్రవహిల్లు వేయి నదులు
ప్రవహిల్లు వేయి నదులు
మన చల్లనైన వనిలో శాంతిల్లు నెల్ల వైరములు
ఈ నందనమ్మునందు - కల కోకిలలము మనమే
కలకోకిలలము మనమే ॥సర్వ॥

3. మతమంటే నొండొరులను - హతమార్చుటగునొ వినుము
హతమార్చుటగునొ వినుము
ఏక గర్భజులము మన మాత భారతమ్మ
ఈ నందనమ్ము నందు కలకోకిలలము మనమే
కల కోకిలలము మనమే ॥సర్వ॥

| పాటపేరు | పేజి నెం. |
|---|---|
| 1. మేలుకొనుమీ భరతపుత్రుడ | 2 |
| 2. ఆకాశము నొసటపొడుచు | 2 |
| 3. సహాయ నిరాకరణము | 3 |
| 4. అన్నలార రండి | 3 |
| 5. వద్దే వద్దే లక్ష్మి | 4 |
| 6. కల్లుత్రాగి | 4 |
| 7. దేశమాత సేవ చేయండి | 5 |
| 8. శ్రీగాంధి నామం మరువం మరువం | 6 |
| 9. స్వదేశ మాత | 6 |
| 10. మా కొర్కె తెల్ల దొరతనము | 7 |
| 11. నమోహిందుమాతా | 12 |
| 12. రాట్నమును పూజింప రారండీ | 12 |
| 13. ఏకులు కావలెనా | 13 |
| 14. రాట్నలక్ష్మికి మంగళ హారతి | 13 |
| 15. అచ్చపు దాస్యశృంఖలము | 14 |
| 16. కొల్లాయి గట్టితే | 14 |
| 17. గాంధి మానిని గొల్వరే | 14 |
| 18. నవ్వవోయీ నీవు గాంధి | 15 |
| 19. మమ్ముబ్రోవ మహిని వెలసితివా | 15 |
| 20. కట్టుకొన్నది అంగవస్త్రము | 16 |
| 21. రమారమణ గోవిందా | 17 |
| 22. వినరా ప్రియ సహోదరుడా | 17 |
| 23. కమ్మగా బ్రతికితే | 18 |
| 24. జగద్రక్షకుడు | 18 |
| 25. గాంధి మహాత్ముడు బయలుదేరగా | 19 |
| 26. కట్టకురా సీమగుడ్డ | 19 |
| 27. దండాలు దండాలు | 20 |
| 28. పాలసముద్రమే | 21 |
| 29. మరువకు దార్యులారా | 22 |
| 30. కొయ్యోడా పదం | 22 |
| 31. ఈ జన్మమిక దుర్లభమురా | 23 |
| 32. గాంధీలాలి | 23 |
| 33. వందే మాతరం | 24 |
| 34. వందనమిదె గైకొనుమీ | 24 |
| 35. కలగంటి కలగంటిమీ | 25 |
| 36. విజయా భవ | 25 |
| 37. వినుడీ! వినుడీ! జనులారా | 26 |
| 38. అదిగదిగో జయధ్వజం | 27 |
| 39. భరతమాతా పిలుపు | 27 |
| 40. ఉయ్యాలా! జంపాలా | 28 |
| 41. మన ప్రియమైన త్రివర్ణ పతాకా | 28 |
| 42. ఏ నివసించెడి భూమికి సాటి | 28 |
| 43. భారతదేశము నాదని | 29 |
| 44. వాడే వైష్ణవుడు | 29 |
| 45. ఎత్తండీ! ఎత్తండీ! స్వాతంత్ర్యపు జెండా | 30 |
| 46. పెట్టరే రాట్నము | 30 |
| 47. దేశభక్తి కనరా | 31 |
| 48. కర్మయోగి | 31 |
| 49. సర్వ ప్రపంచమందు | 32 |

# మా సంస్థ గురించి...

లలిత సంగీతానికి ప్రాచుర్యం కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో 1988వ సంవత్సరంలో నాదవినోదిని సాంస్కృతిక సంస్థ స్థాపించబడింది. మా సంస్థ ద్వారా ఇప్పటి వరకూ అనేక లలితసంగీత ఆడియో క్యాసెట్లు విడుదలయ్యాయి. ఈ ఆడియో/సీడీలలో కృష్ణశాస్త్రి, శశాంక, బోయి భీమన్న, పుట్టపర్తి నారాయణాచార్యులు తదితరుల పాటలు పొందుపరచడం జరిగింది. అంతేగాక ఎన్నెన్నో లలిత సంగీత కార్యక్రమాలు ఆయా పండుగల సందర్భంగా వివిధ ప్రాంతాలలో ఇవ్వడం జరిగింది.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి లలిత గీతాల పాటల పోటీలు పెద్దయెత్తున అయిదేళ్ళుగా మా  సంస్థ నిర్వహిస్తున్నది. ఉగాది, దసరా, సంక్రాంతి, శ్రీరామ నవమి, వెన్నెల పాటలు ఇలా ఒకటేమిటి పెళ్ళి పాటలతో సహా రకరకాల పండుగ లకు, పర్వాలకు అనువైన పాటలను 'నాదవినోదిని' సభ్యులు శిక్షణ పొంది ఎన్నో వేదికలపై వీనులవిందుగా గానం చేస్తున్నారు.

శ్రీ గురజాడ అప్పారావు మొదలుకొని నేటి తరం వరకూ తెలుగు లలిత సంగీతంలో ఆణిముత్యాల్లాంటి పాటలను ఏర్చి, కూర్చి 'పాటల పల్లకి'గా రూపొందించాలనే మా బృహత్ప్రణాళికలోని భాగంగా మొదట ఈ దేశభక్తి గేయాలు ముందు తరాలవారి కోసం ఆడియో/సీడీలలో అందిస్తున్నాము. ఈ సంకలనానికి శ్రీ సిహెచ్.వి.వి.మూర్తి రాజుగారు ఆర్థిక సహాయం అందించారు. వారికి మేము సర్వదా కృతజ్ఞులము.

మన తెలుగు జాతిని సుసంపన్నం చేసిన గేయాలలోనుంచి కొన్ని ప్రఖ్యాతి గాంచిన భక్తి, లలిత, సాంప్రదాయ గీతాలను ఆడియో/సీడీల రూపంలో భద్రపరచాలని మేము ప్రయత్నిస్తున్నాము. మా ప్రయత్నాలకు సంగీత, సాహిత్య అభిమానుల అండదండలు, ఆశీస్సులు సర్వదా ఉంటాయని ఆశిస్తున్నాము.

—నాదవినోదిని